# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## రంగనాథస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది : సీఎం కేసీఆర్

చెన్నై, డిసెంబర్ 13:: శ్రీరంగంలోని రంగనాథస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. స్వామి వారి దర్శన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. శ్రీరంగం ఆలయ దర్శనానికి రావడం ఇది రెండోసారి అని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రంగనాథస్వామిని దర్శించుకోవడంతో ఇదే తొలిసారి అని చెప్పారు. రేపు సాయంత్రం తమిళనాడు సీఎం స్టాలిన్‌తో సమావేశం అవుతానని కేసీఆర్ ప్రకటించారు.

తమిళనాడు తిరుచిరాపల్లి జిల్లా శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రంగనాథస్వామిని దర్శించుకున్న సీఎం కేసీఆర్ మొక్కులు చెల్లించుకున్నారు. వేద మంత్రాలతో రంగనాథ స్వామి ఆలయ పండితులు సీఎం కేసీఆర్ కు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు గజరాజు నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు తిరుచ్చి కలెక్టర్ శ్రీనివాసు, తమిళనాడు మంత్రి అరుణ్ నెహ్రూ కేసీఆర్‌కు స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లారు.


హైదరాబాద్ | మంగళవారం 14-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 107 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# శ్రీరంగం ఆలయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు



చెన్నై, డిసెంబర్ 13:: తమిళనాడు తిరుచిరాపల్లి జిల్లా శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగనాథస్వామిని దర్శించుకున్న సీఎం కేసీఆర్ మొక్కులు చెల్లించుకున్నారు. వేద మంత్రాలతో రంగనాథ స్వామి ఆలయ పండితులు సీఎం కేసీఆర్ కు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు గజరాజు నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు తిరుచ్చి కలెక్టర్ శివరాసు, తమిళనాడు మంత్రి అరుణ్ నెహ్రూ కేసీఆర్‌కు స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లారు.

## కాశీ కారిడార్ నిర్మాణ కార్మికులతో కలిసి మోదీ భోజనం

వారణాని, డిసెంబర్ 13: ఉత్తరప్రదేశ్ వారణాసిలోని ప్రతిష్ఠాత్మక కాశీ విశ్వనాథ్ కారిడార్‌ను సోమవారం ప్రారంభించిన ప్రధాని మోదీ, దాని నిర్మాణంలో భాగమైన కార్మికులతో కలిసి భోజనం చేశారు.

కాశీ విశ్వనాథ్ ధామ్ కారిడార్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కార్మికులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. చారిత్రక కాశీ విశ్వనాథ దేవాలయం వద్ద ఐకానిక్ దశాశ్వమేధ ఘాట్ సమీపంలో రూ.339 కోట్ల వ్యయంతో నిర్మించిన కాశీ కారిడార్ తొలి ఫేజ్‌ను మోదీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని కొంతసేపు భోజ్‌పురి భాషలో కూడా మాట్లాడారు. కొత్త భారతదేశం దాని సంస్కృతి గురించి గర్విస్తోందని, దాని సామర్థ్యంపై కూడా విశ్వాసం ఉందని అన్నారు. నవ భారతదేశంలో 'విరాసత్' మరియు 'వికాస్' ఉన్నాయన్నారు.

# ఔరంగజేబు వస్తే.. శివాజీ ఎదురు నిలబడతాడు: ప్రధాని మోదీ

కాశీ, డిసెంబర్ 13: ప్రధాని మోదీ ఇవాళ కాశీ కారిడార్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ.. విశ్వనాథుడి ప్రియదినం సోమవారం అని.. దశమి తిథి..ఇక్కడ కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు. విశ్వనాథ ధామం అకల్పనీయ రీతిలో వెలిగిపోతోందన్నారు. ఈ క్షేత్రాన్ని పునస్థాపితం చేస్తున్నామన్నారు. కాశీ అవినాశిని అని, ఇక్కడ ఒకటే సర్కార్ ఉంటుందని, ఎవరి చేతుల్లో ఢమరుకం ఉంటుందో, వారి సర్కారే ఇక్కడ నడుస్తుందని మోదీ అన్నారు. శివుడి ప్రసన్నతలేనిదే ఇక్కడకు ఎవరూ రాలేనన్నారు. ఇక్కడ ఏది జరిగినా.. అది మహాదేవుడి ఇచ్ఛతోనే జరుగుతందన్నారు. ఇక్కడ జరిగిందంతా కూడా ఆ మహాదేవుడే చేశారన్నారు.

ఆకతాయిలు ఈ నగరంపై ఆక్రమణ చేశారని, ధ్వంసం చేయాలని చూశారన్నారు. ఔరంగజేబు అత్యాచారాలు..



అతని ఆకతాయి పనులకు సాక్ష్యాలన్నారు. ఇక్కడి సభ్యతను తల్వార్‌తో మార్చాలనుకున్నాడని, సంస్కృతిని నాశనం చేయాలనుకున్నాడని, కానీ ఈ భూమి మట్టి మిగితా ప్రపంచంతో వేరైందన్నారు. ఇక్కడకు ఔరంగజేబు వస్తే, అప్పుడు శివాజీ కూడా ఎదురు నిలబడుతారన్నారు. సాలార్ మసూద్ ఇటు వైపు వస్తే.. రాజా సుహల్‌దేవ్ లాంటి వీర యోధులు శక్తి చాటుతారన్నారు. ఆంగ్లేయుల పాలన సమయంలోనూ వారెన్ హాస్టింగ్‌కు కాశీవాసులు ఎటువంటి దుస్థితి పట్టించారో గుర్తు తెచ్చుకోవాలన్నారు.

కాశీకి రావడానికి నేటి తరం వాళ్లు గర్వంగా ఫీలవుతారన్నారు. ఇది ప్రాచీన, ఆధునిక సంస్కృతల మేళవింపు అన్నారు. కొత్త చరిత్రను సృష్టించామన్నారు. దీన్ని వీక్షించడం మన అదృష్టమన్నారు. బనారస్‌కు విశ్వాసంతో వచ్చానన్నారు. ఇక్కడ ప్రజలపై విశ్వాసంతో వచ్చినట్లు చెప్పారు.

## దేశ విభజన చారిత్రక తప్పిదం : ఎన్సీ నేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: భారతదేశ విభజన చారిత్రాత్మక తప్పిదమని, కాశ్మీరీలే కాకుండా ముస్లిం సమాజం దాని భారాన్ని భరించాల్సి వచ్చిందని నేషనల్ కాన్ఫరెన్స్ జాతీయ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. దేశ విభజనపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను సమర్థించిన ఆయన.. విభజన జరగకపోయి ఉంటే ఇరువర్గాలు శాంతియుతంగా సహజీవనం చేయడంతో పాటు దేశం మరింత శక్తివంతంగా ఉండేదన్నారు.

కాశీ విశ్వనాథ్ కారిడార్ ప్రారంభోత్సవం సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇది చాలా మంచి చర్య. అయితే ప్రధాని నరేంద్ర మోదీ ఒక దేశానికి ప్రధానమంత్రి అయినందున అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. అనేక మతాలు ఉన్నాయి' అన్నారు. హిందూ, హిందుత్వంపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యపై అబ్దుల్లా స్పందిస్తూ.. 'మతాలు ఎప్పుడూ చెడ్డవి కావు. మనుషులు' అని అన్నారు.

'హిందూ కో అస్లీ హిందూ బన్నా చాహియే' (హిందువు నిజమైన హిందువుగా మారాలి), వారి మతాన్ని అనుసరించాలని తాను ఆశిస్తున్నానని చెప్పారు. ఆదివారం, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ మాట్లాడుతూ మత ప్రాతిపదికన దేశ విభజన 'చారిత్రక తప్పిదం' అని అన్నారు. బంగ్లాదేశ్ విముక్తికి సాయుధ బలగాలు అందించిన సహకారాన్ని స్మరించుకునేందుకు ఏర్పాటు చేసిన 'స్వర్ణిమ్ విజయ్ పర్వ్' వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా ఇండియా గేట్ లాన్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రక్షణ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఒమిక్రాన్ చాలా ప్రమాదకారి.. కానీ డేటా లేదు: ప్రపంచ ఆరోగ్య సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: ఒమిక్రాన్ వేరియంట్ చాలా ప్రమాదకారి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా దీనికి చాలా హై రిస్క్ ఉందని ఈ సంస్థ అభిప్రాయపడింది. ఇది వ్యాక్సిన్ రక్షణ నుంచి తప్పించుకుంటుందనడానికి కొన్ని ఆధారాలు కనిపిస్తున్నాయని, కాబట్టి దీని తీవ్రత చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పింది.

అయితే ఈ వేరియంట్ తీవ్రతను అంచనా వేయడానికి సరిపోయే డేటా లేదని పేర్కొంది. ప్రాథమిక పరిశోధన ప్రకారం, ఇన్‌ఫెక్షన్ పెరగకుండా ఉంచే ఇమ్యూనిటీ వ్యవస్థ నుంచి ఈ వేరియంట్ తప్పించుకుంటోందని, అదే సమయంలో చాలా వేగంగా వ్యాప్తి చెందే లక్షణాలు కనబడుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. భవిష్యత్తులో ఇది మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

# స్వచ్ఛతలో ముందున్న హైదరాబాద్: మంత్రి తలసాని



హైదరాబాద్, డిసెంబర్ 13: స్వచ్ఛతలో హైదరాబాద్ నగరం ముందుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ (ఒజీశ్రీజీబజీనితి నాతీతినితిలజీబ ఎజీటజీల)అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న హాస్పిటాలిటీ ఎక్కడా లేదన్నారు.

స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా జీహెచ్ఎంసీ కొత్తగా సమకూర్చిన 250 స్వచ్ఛ ఆటోలను సనత్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ వెల్ఫేర్ గ్రౌండ్‌లో తలసానితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. స్వచ్ఛతలో హైదరాబాద్‌కు ఎన్నో అవార్డులు వచ్చాయని చెప్పారు. నగరంలో పార్కులు, రోడ్లు, బస్ షల్టర్లు సుందరంగా మారాయన్నారు.

నగరవాసులు స్వచ్ఛ ఆటోలను ఉపయోగించుకోవాలని సూచించారు. చెత్తని ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను గ్రీన్‌సిటీగా మార్చడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 13:తెలంగాణను గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో లాక్ డౌన్ తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, ములుగు, తొర్రూర్, మరిపెడ లాంటి ప్రదేశాలలలో గుడుంబా అమ్మకాలు సాగిస్తున్నారన్నారనే సమాచారంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాగర్ కర్నూలు జిల్లాలోని అచ్చంపేట, కొల్లపూర్‌లలో అక్కడక్కడా గుడుంబా అమ్మకాలు జరుగుతున్నాయి. వాటిని వెంటనే నిర్మూలించాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులు ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి అమ్మకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు.

గంజాయిని అమ్మకాలు, రవాణా చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ , బైండోవర్ కేసులను నమోదు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పోలీస్, ఆబ్కారీ శాఖల అధికారులు సమన్వయం చేసుకొని గంజాయి స్మగ్లింగ్ ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నీరా పాలసీ పనులను వేగవంతం చేసి వచ్చే రెండు నెలల్లో అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. నీరా అనుబంధ ఉత్పత్తులకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనంలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నీరా ఉత్పత్తి ప్రభుత్వం ఇప్పటికే జీవోను విడుదల చేసిందన్నారు.

బీసీ కార్పొరేషన్, ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులు వెంటనే సమన్వయ సమావేశం నిర్వహించుకొని టెండర్లు పిలవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుడుంబా నిర్మూలనకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

సమావేశంలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు కమిషనర్ అజయ్ రావు, జాయింట్ కమిషనర్ ఖురేషీ, డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, హరికిషన్, డేవిడ్ రవికాంత్, సహాయ కమిషనర్ దత్తరాజు గౌడ్, చంద్రయ్య గౌడ్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

హైదరాబాద్, డిసెంబర్ 13:తెలంగాణలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక సంస్థల కోటాలో కరీంనగర్ జిల్లాలో రెండు స్థానాలకు, ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఒక్కో స్థానానికి పోలింగ్ జరిగింది. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపును ప్రారంభించనున్నారు.

మధ్యాహ్నం 12 గంటల వరకు పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడి అయ్యే అవకాశం ఉంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 99.70 శాతం పోలింగ్ నమోదు కాగా, 1324 మంది ఓటర్లకు గానూ 1320 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 99.22 శాతం పోలింగ్(1018/1026), ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 97.01 శాతం(1233/ 1271), ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 96.09 శాతం(738/768), ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 91.78 శాతం పోలింగ్(860/937) నమోదైంది. పలు పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం పోలింగ్ నమోదైంది.

కరీంనగర్‌లో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగగా, 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. టీఆర్ఎస్ పార్టీ నుంచి ఎల్ రమణ, భానుప్రసాద్ రావు పోటీలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో ఒక ఎమ్మెల్సీ స్థానానికి.. టీఆర్ఎస్ నుంచి తాత మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ నుంచి రాయల నాగేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాసరావు, కొండూరు సుధారాణి పోటీలో ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ నుంచి దండె విఠల్, స్వతంత్ర అభ్యర్థి పుష్పరాణి బరిలో ఉన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ఒక ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగగా, టీఆర్ఎస్ నుంచి యాదవరెడ్డి, కాంగ్రెస్ తరపున తూర్పు నిర్మల, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మల్లారెడ్డి బరిలో ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ నిర్వహించారు. ఈ స్థానానికి టీఆర్ఎస్ నుంచి ఎంసీ కోటిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు నగేశ్, లక్ష్మయ్య, కే వెంకటేశ్వర్లు, ఈర్పుల శ్రీశైలం, బెజ్జం సైదులు, కొర్ర రామ్‌సింగ్ పోటీ చేశారు.

## భారత అమ్ములపొదిలో మరో వెపన్.. లాంగ్ రేంజ్ సూపర్‌సోనిక్ మిస్సైల్ ప్రయోగం సక్సెస్..



న్యూఢిల్లీ, డిసెంబర్ 13:ఇండియా అమ్ముల పొదిలో మరో వెపన్ చేరబోతోంది. బాలాసోర్ తీరంలో సుదూర శ్రేణి సూపర్‌సోనిక్ మిస్సైల్ సహాయక టార్పెడోను భారత్ ఇవ్వాల (సోమవారం) సక్సెస్‌ఫుల్‌గా పరీక్షించింది. ఇండియన్ నేవీ కోసం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) ఈ వెపన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తోందని రక్షణ అధికారి ఒకరు తెలిపారు. ఒడిశాలోని బాలాసోర్ తీరంలో లాంగ్ రేంజ్ సూపర్‌సోనిక్ మిస్సైల్ అసిస్టెడ్ టార్పెడో (స్మార్ట్)ని విజయవంతంగా పరీక్షించినట్టు చెప్పారు. "టార్పెడో యొక్క సాంప్రదాయ పరిధికి మించి యాంటీ-సబ్ మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాన్ని మెరుగుపంచడానికి ఈ వ్యవస్థ రూపొందించాం" అని ఆఖీఆ ఒక ప్రకటనలో తెలిపింది.

క్షిపణి యొక్క లక్ష్యాలను చేరుకోవడంలో ఆఖీఆ, భారత వైమానిక దళం (ఎంఈ) నిర్వహించిన విమాన-పరీక్ష "విజయవంతమైంది" అని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంఈ కోసం అభివృద్ధి చేసిన ఈ వెపన్ 10 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను నిర్వీర్యం చేయగలదని పేర్కొంది.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ అంబరమును చుంబించు - ది
గంబర కవితోద్యమమున కార్యకారకుండై
డంబము నెరుగక - వానికి
సంబరము నొసంగె - విదుధ - "జ్వాలాముఖి"యై!

(డిసెంబర్ 14 దిగంబర కవి జ్వాలాముఖి జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210






# విద్యుత్తు వాహనాలే ప్రత్యామ్నాయమా?!

ప్రపంచాన్ని నడిపే సాధనం ఇంధనం లేదా శక్తి మాత్రమే. శక్తిని ఉత్పత్తి చేయడం లేదా నాశనం చేయడం అసాధ్యమే అయినా శక్తిని ఒక రూపం నుంచి మరొక రూపంలోకి మాత్రమే మార్చవచ్చని సైన్స్ మౌళిక సూత్రీకరణ చేసింది. బొగ్గు దహనంలో ఉష్ణం, ఉష్ణంతో నీరు మరిగి ఆవిరి కావడం, ఆవిరితో టర్బైన్లు తిరగడం, టర్బైన్లు కదలడంతో విద్యుత్తు జననం, విద్యుత్తుతో బల్బులు వెలగడం మనకు తెలుసు. విద్యుచ్ఛక్తి, యాంత్రిక శక్తి, రసాయన శక్తి, ఉష్ణశక్తి, స్థితిశక్తి, గతిశక్తి లాంటి ఒక రూపంలో ఉన్న శక్తిని మరో రూపంలోకి సులభంగానే మార్చవచ్చు. దహన క్రియలో మండి ఉష్ణశక్తిని విడుదల చేసే సంప్రదాయ శిలాజ ఇంధనాలలో వాయు (యల్‌పిజీ), ద్రవ (పెట్రోల్), ఘన (బొగ్గు/వంట చెరుకు) ఇంధనాలు లాంటి తరిగే ఇంధనాలతో పర్యావరణ కాలుష్యం అధికంగా నమోదు అవుతున్నది. సౌర, పవన, అలల శక్తి వనరులను సంప్రదాయేతర, తరగని, పునరుత్పాదక ఇంధనాలుగా వ్యవహరిస్తారు. తరిగే ఇంధనాల వినియోగంతో గాలి కాలుష్యం, పర్యావరణ/వాతావరణ ప్రతికూల మార్పులు, ప్రకృతి దుర్వినియోగం లాంటివి కలుగుతాయి. సంప్రదాయ ఇంధనాల వినియోగంతో వాటి లభ్యత తగ్గుతూ, కార్బన్ ఉద్గారాలు పెరుగుతాయి. తరగని సంప్రదాయేతర ఇంధనాల వినియోగంతో భూగ్రహం ఉన్నంతకాలం వాటి కొరత అసలే ఉండదు. ఇలాంటి పునరుత్పాదక ఇంధనాలు దేశాభివృద్ధిలో అత్యంత ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. ఇలాంటి పర్యావరణ హిత తరగని ఇంధనాలే భవిష్యత్తు ఆశారూపాలుగా నిలుస్తున్నాయి. ఇంధనాల విచ్చలవిడి వాడకాన్ని తగ్గించడం, ఇంధన పొదుపు మార్గాలను వివరించడం, ప్రజారవాణను ఆశ్రయించడం లాంటి తగు జాగ్రత్తలను సామాన్య జనానికి, విద్యార్థిలోకానికి, ఇంధన వినియోగదారులకు వివరించడానికి ప్రతి ఏట 14 డిసెంబర్‌న "జాతీయ శక్తి పరిరక్షణ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది.

## శక్తి తలసరి వినియోగం:

ప్రపంచ జనాభాలో 18 శాతం ఉన్న భారతంలో ప్రపంచ శక్తి వినియోగంలో 6 శాతం మాత్రమే అని తెలుస్తున్నది. దేశ ప్రగతిని శక్తి తలసరి వినియోగం ఆధారంగా నిర్ణయించే ఆధునిక డిజిటల్ యుగంలో ప్రపంచ మానవాళి ఉన్నది. పేద దేశాల్లో శక్తి తలసరి వినియోగం అతి తక్కువగా ఉండడం, ధనిక దేశాల్లో అత్యధికంగా ఉండడం సహజంగా కనిపిస్తుంది. చైనా, అమెరికా, రష్యా, ఇండియా, జపాన్, కెనడా, యూకె లాంటి దేశాలు అధిక విద్యుత్తును వినియోగిస్తున్నాయి. శక్తి తలసరి వినియోగంలో అగ్రభాగాన ఐస్‌లాండ్ (53,832 కెడబ్ల్యూహెచ్), కెనడా (15,438), అమెరికా (13,098), ఆస్ట్రేలియా (10,071), జపాన్ (8,010), చైనా (4,906 కెడబ్ల్యూహెచ్)లు నమోదైనాయి. ఇండియాలో తలసరి శక్తి వినియోగం 1208 కెడబ్ల్యూహెచ్ మాత్రమే నమోదైంది. భారత్‌లో 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల శక్తి తలసరి వినియోగం జాతీయ సగటు కన్న తక్కువగా, 19 రాష్ట్రాల్లో అధికంగా నమోదు అవుతున్నాయి. అత్యధిక తలసరి వినియోగం దాద్రా, నగర్ హవేలి 15,517 కెడప్ల్యూహెచ్‌తో తొలి స్థానంలో ఉండగా, బీహార్‌లో కనిష్టంగా 332 కెడబ్ల్యూహెచ్ మాత్రమే ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో 1,319, తెలంగాణలో 1,551 కెడబ్ల్యూహెచ్ తలసరి వినియోగం గమనించబడింది. ఇండియాలో 74 శాతం శక్తిని పారిశ్రామిక, వ్యవసాయరంగాలు మాత్రమే వినియోగిస్తున్నాయి. తరువాత 3వ స్థానంలో గృహ వినియోగం ఉందని తెలుస్తున్నది.

## విద్యుత్తు వాహనాలే ప్రత్యామ్నాయమా?!

ప్రపంచ కార్ల మార్కెట్‌లో 5వ స్థానంలో ఉన్న ఇండియా మె?దటి మూడు స్థానాలలో చేరడానికి ఎంతో సమయం పట్టదని, 2030 నాటికి దాదాపు 40 కోట్ల కార్లు వినియోగంలో ఉంటాయని తేలుతున్నది. కార్లు, ఇతర వాహనాల వినియోగం పెరుగుట వల్ల ఇంధన ఉపయోగం, రవాణ రద్దీ, రోడ్ల వసతుల కొరత, గాలి కాలుష్యం, నగరాల్లో కాలుష్య మబ్బులు కమ్మడం లాంటి పలు అనర్థాలు తప్పనిసరి జరుగుతున్నాయి. నడక, ప్రజా రవాణ, రైలు మార్గాలు, రోడ్ల విస్తరణతో పాటు 'పర్యావరణ హిత కార్లు' సత్వరమే రావలసి ఉంది. శిలాజ చమురు ఇంధన వాహనాలకు నెమ్మదిగా చరమగీతం పాడుతూ, విద్యుత్తు కార్లు ప్రవేశించాల్సి ఉంది. 2030 నాటికి కనీసం 30 శాతం విద్యుత్తు వాహనాలు రానున్నాయని, వీటి వినియోగం పెరుగుతూ, చమురు వాహనాల ఉపయోగం తగ్గినపుడు మనం ఆశించిన కాలుష్య మబ్బులు వేగంగా తొలగి పోయే మంచి రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలుస్తున్నది. 2020లో విద్యుత్తు కార్ల అమ్మకాలు 2.1 మిలియన్లకు చేరాయని, నేడు విద్యుత్తు కార్ల అమ్మకాలు 2 శాతం ఉండడం శుభ సూచకమనే చెప్పాలి. విద్యుత్తు వాహనాల వినియోగం వాటి స్టోరేజ్ బ్యాటరీల లభ్యత మీదనే ఆధారపడి ఉంటాయి. వాహన స్టోరేజి బ్యాటరీలు ఇండియాలో తయారు కాని కారణంగా విదేశాల నుంచి దిగుబడి చేసుకోవలసి ఉంది. 2021లో ఇండియా 1 బిలియన్ డాలర్ల విలువైన లిథియం బ్యాటరీలను దిగుబడి చేసుకుంది. విద్యుత్తు వాహనాల వినియోగాన్ని పెంచడానికి భారత ప్రభుత్వం ఫేమ్-2 పథకం కింద రూ: 10,000 కోట్లు, పియల్‌ఐ బ్యాటరీ సెల్స్ పథకం కింద రూ: 18,100 కోట్లు, పియల్‌ఐ ఆటోమోటివ్ విడిభాగాల పథకానికి రూ: 25,938 కోట్లు వెచ్చిస్తున్నది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వాములు చమురు వాహనాల వాడకాన్ని తగిస్తూ, విద్యుత్తు వాహనాల వినియోగం పెంచితే పర్యావరణానికి, వాహనదారుల ఖర్చులకు కళ్లెం పడుతుంది.

## శక్తి పొదుపు మార్గాలు:

నిత్యజీవితంలో శక్తి వనరులను కనిష్టంగా వాడడం, కార్యదక్షత అధికంగా ఉన్న వాహనాలను వినియోగించడం, విద్యుత్తు వాహనాల వాడకాన్ని పెంచడం, ప్రజారవాణ వ్యవస్థను పటిష్ట పరచడం, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం, పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, సంప్రదాయేతర శక్తి ఉత్పత్తిని పెంచడం, సియఫ్‌యల్/యల్‌ఈడి బల్బుల వాడకం, స్మార్ట్ పవర్ సిస్టమ్స్/ప్రోగ్రామబుల్ థర్మోస్టాట్స్ వాడడం, ఎఫిషియంట్ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వాడడం, శక్తి వృధాను అరికట్టడం, గీజర్ల వాడకాన్ని తగ్గించడం, ఉష్ణబంధక/లీక్ ప్రూఫ్ నిర్మాణాలు చేపట్టడం, హెచ్‌వీఏసి ఎనర్జీ స్టార్ అప్‌గ్రేడెడ్ ఉపకరణాలను వాడడం లాంటి చర్యలు/జాగ్రత్తలు మాత్రమే ఆరోగ్యకర భవిష్యత్తుకు పునాదులని భావిద్దాం. కనిష్ట శక్తి వినియోగంతో బిల్లుల ఖర్చు తగ్గడం, జాతీయ సమస్య తీవ్రత తగ్గడం, ఫారిన్ ఎక్స్ఛేంజ్ సమస్యను తగ్గించడం, పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేయడం వంటి అంశాల్లో జాగ్రత్త పడాలి. ఇంధన వాడకాన్ని తగ్గించడానికి సైక్లింగ్, ప్రజా రవాణలను వాడడం అలవాటు చేసుకోవాలి. శిలాజ ఇంధన వాహనాలకు బదులు ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగం భవిష్యత్తు ఆశాకిరణంగా తోస్తున్నది. ఇంట్లో/కార్యాలయాల్లో అనవసరంగా బల్బులు, ఫ్యాన్లు, ఏసిలు (24-26 డిగ్రీలు), గీజర్లు, టీవీలు, ఐరన్ బాక్సుల వాడకాన్ని ప్రతి ఒక్కరు భాద్యతగల పౌరుల వలె కట్టడి చేయాలి. కార్యాలయ, ఇంటి పైకప్పుల్లో సౌరశక్తి ఉత్పత్తి ఏర్పాట్లు తప్పనిసరి చేయాలి. సౌరశక్తితో వీధి దీపాల వాడకం ఉండేలా చూసుకోవాలి. పవన, అలల శక్తి ఉత్పత్తులను పెంచడాన్ని ప్రోత్సహించాలి. స్వంత డబ్బును మితంగా వాడినట్లు, మన గృహాల్లో విద్యుత్తును పరిమితంగా వినియోగించాలి.

సంప్రదాయ శిలాజ ఇంధనాల వినియోగంతో కార్బన్ ఉద్గారాల సమస్య ఉత్పన్నం అవుతుందని గమనించాలి. శక్తిని వ్యర్థం చేయడం నేర సమానమనే సద్భావనలు విస్తరించాలి. శక్తి వినియోగ బానిసలుగా మారుతున్న ప్రపంచ మానవాళి రాబోయే రోజుల్లో శక్తి కొరతను ఎదుర్కోవచ్చని హెచ్చరిస్తున్నారు. జాతి అపూర్వ అమూల్య సంపద శక్తి మాత్రమే అని గమనించాలి. శక్తిని మితంగా వాడే పౌరులే అసలైన దేశభక్తులని, శక్తిని ఆదా చేయడం అలవాటు చేసుకొని, రేపటి అవిచ్ఛిన్న వెలుగులకు పునాదులు వేద్దాం. శక్తిని తెలివిగా వాడుకుంటూ, తెలివైన పౌరులమని నిరూపించుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# దక్షిణాఫ్రికాలో పిల్లలపై విరుచుకుపడుతున్న ఒమిక్రాన్.. ఐసీఎంఆర్ తాజా అధ్యయనంలో వెల్లడి..

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:తెలంగాణలో సెకండ్ వేవ్ సమయంలో కొవిడ్ బారిన చిన్నారుల్లో 80శాతం మందికి డెల్టా వేరియంట్ సోకినట్లు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) అధ్యయనంలో వెల్లడైంది. తెలంగాణతోపాటు రాజస్తాన్, చత్తీస్‌గడ్, పంజాబ్, కర్ణాటక తదితర 9 రాష్ట్రాల్లో ఐసీఎంఆర్ పిల్లలపై కొవిడ్ ప్రభావంపై సర్వే నిర్వహించింది. దేశ వ్యాప్తంగా 583 మంది చిన్నారులపై అధ్యయనం చేయగా అందులో 36 మంది తెలంగాణ నుంచి ఉన్నారు. గతేడాది మార్చి-2020 నుంచి ఈ ఏడాది జులై 2021 వరకు ఐసీఎంఆర్ చిన్నారులపై కొవిడ్ ప్రభావంపై అధ్యయనం చేసింది. డెల్టా బారిన పడిన చిన్నారుల్లో చాలా ప్రధానంగా జ్వరం, దగ్గు, ముక్క కారడం, గొంతులో గరగర వంటి లక్షణాలు కనిపించాయి. ఐసీఎంఆర్ అధ్యయనంలో కొవిడ్ బారిన పడిన చిన్నారుల్లో? 55శాతం మంది అబ్బాయిలు కాగా? 45శాతం మంది బాలికలు ఉన్నారు

ప్రస్తుతం ఒమిక్రాన్ ఆందోళనల వేళ చిన్నారులను కొవిడ్ నుంచి రక్షించుకోవాల్సిన అవసరాన్ని తాజా ఐసీఎంఆర్ సర్వే స్పష్టం చేస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒమిక్రాన్ ఎక్కువగా వ్యాప్తిలో ఉన్న దక్షిణాఫ్రికాలో ప్రస్తుతం పెద్ద ఎత్తున చిన్నారులు కొవిడ్ బారిన ప

# రాపూరు అడవిలో లభించిన డెడ్‌బాడీ..



అమరావతి, డిసెంబర్ 13:నెల్లూరు జిల్లాలో నిన్న రాత్రి ఓ వ్యక్తి తప్పిపోయిన ఘటన జరిగింది. నలుగురు విద్యార్థులు కలిసి రాపూరు దగ్గర్లలోని సిద్ధలయ్యకోన జలపాతం చూడ్డానికి వెళ్లారు. సాయంత్రం దాకా అక్కడ జలపాతంలో ఆడుకుని ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే కొంత దూరం వచ్చిన తర్వాత వారిలో ఒక వ్యక్తి కనిపించక పోవడంతో అక్కడ చాలా దూరం వరకు వెతికారు. కానీ ప్రయోజనం లేకపోవడంతో రాపూరు పోలీసు స్టేషన్‌లో కంప్లెయింట్ చేశారు.

కాగా, రాపూరు అటవీ ప్రాంతంలోని సిద్దలయ్యకొన జలపాతం వద్ద తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ ఈ రోజు దొరికింది. గూడూరు చవటపాలెం గ్రామానికి చెందిన పాలాపు కిషోర్ అనే యువకుడు గల్లంతు అవ్వగా అతడి డెడ్‌బాడీని సిద్ధలయ్యకోన జలపాతంలో గుర్తించారు పోలీసులు. రాపూరు ఎస్సై క్రాంతి కుమార్, ఫైర్ స్టేషన్ సిబ్బంది కలిసి కిషోర్ మృతదేహాన్ని జలపాతం నుండి బయటకు తీశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# కటింగ్ లేకుండా వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలి.. భవేశ్ మిశ్రా

వరంగల్, డిసెంబర్ 13: కటింగ్ లేకుండా వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మిల్లర్ లను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు అతి తక్కువ స్థాయిలో వరిధాన్యం కొనుగోలు జరిగిందని, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిబంధనల మేరకు తేమశాతం పాటిస్తూ, తాలు తీసేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపినా కూడా వివిధ అభ్యంతరాలు తెలుపుతూ మిల్లర్లు వరిధాన్యాన్ని తీసుకోవడం లేదనే కంప్లైంట్స్ వస్తున్నాయని, రైతుల నుండి కంప్లైంట్స్ రాకుండా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి పంపిన వరి ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాలని ఆదేశించారు.

మిల్లర్లు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల మధ్య ఉన్న గందరగోళాన్ని సరిచేసేందుకు రేపు మంగళవారం రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు, మిల్లర్లు, పిఎసిఎస్ చైర్మన్ లు మరియు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా పౌర సరఫరాలసంస్థ మేనేజర్ రాఘవేందర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి గౌరీశంకర్, రైస్మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ కోరే రమేష్, పౌరసరఫరాలశాఖ అధికారులు మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాలకు మహర్దశ : మంత్రి సబితారెడ్డి

రంగారెడ్డి, డిసెంబర్ 13:ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో పురపాలక మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో తెలంగాణలోని పట్టణాలకు మహర్దశ పట్టిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ, భగత్ సింగ్ నగర్, క్రాంతి నగర్, ఉర్దూ మీడియం స్కూల్ దగ్గర, వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 3, భగత్ సింగ్ నగర్ ఫేస్ -2 కాలనీలలో రూ. 85 లక్షల రూపాయలతో చేపట్టే యూజీడీ పైప్ లైన్ పనులకు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.



ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ?. శివార్లలో పెరుగుతున్న కాలనీలకు రక్షిత మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో మిషన్ భగీరథ ద్వారా రూ. 1200 కోట్ల నిధులను ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేశారని తెలిపారు. మిషన్ భగీరథ కు కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు కురిపిస్తోందని తెలిపారు. మునిసిపల్ శాఖపై మునిసిపల్ మంత్రి కేటీఆర్ పూర్తి అవగాహనతో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధికి బాటలు వేస్తున్నారనీ కితాబిచ్చారు. పట్టణ ప్రగతిలో భాగంగా తీసుకున్న చర్యలతో నేడు స్వచ్ఛ కాలనీలు, బస్తీలుగా మారడంతో గతంలో కన్నా సీజనల్ వ్యాధులు తగ్గాయని తెలిపారు. సివరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్స్, నూతన లైన్ల కోసం రూ. 3500 కోట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేశారని సబితారెడ్డి పేర్కొన్నారు.

# ప్రజాదరణ పెరుగుతున్న నేపథ్యంలో బస్సుల సంఖ్య పెంచాలి..

హైదరాబాద్, డిసెంబర్ 13:ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు వారి ఆదరాభిమానాలను చూరగొనేందుకు సంస్థ ఎండీ రోజుకో కొత్త తరహా నిర్ణయాలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. గతంలో ఏ అధికారి కూడా చేయని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. "మా ఊరికీ బస్సు" కావాలన్న డిమాండ్ రాష్ట్ర వ్యాప్తంగా రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయి. గతంలో బస్సు నడపాలంటూ గ్రామస్థులంతా కలిసి వినతి పత్రం ఇస్తే ఆదాయాన్ని అంచనా వేసుకున్న అనంతరం నిర్ణయం తీసుకునే వారు. కానీ మారిన కాలాన్ని బట్టి ట్విట్టర్‌లో బస్సు నడపాలని కోరితే వెంటనే ఆ ఊరికి, ప్రాంతానికి బస్సును పంపించేలా ఎండీ చర్యలు తీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు సమస్యపై ఎవరూ దృష్టి పెట్టడం లేదన్న చర్చ అధికార వర్గాల్లో జోరందుకుంది. బస్సు నడిపించాలంటున్న ఉన్నతాధికారి సాధ్యాసాధ్యాలను తెలుసుకోవడం లేదని, డిపోలో ఎన్ని బస్సులున్నాయి, ఎన్ని రూట్లలో తిరుగుతున్నాయన్న విషయాలను ఆరా తీయకుండానే నిర్ణీత సమయంలోగా బస్సు నడిపించాలనడంతో అధికారులు హైరానా పడుతున్నారు.

ఆర్టీసీలో ప్రస్తుతం 9700 వరకు బస్సులున్నాయి. వీటిల్లో 3100 బస్సుల వరకు అద్దెవి ఉన్నాయి. ఆర్టీసీకి ఉన్న బస్సులలో సంస్థ చైర్మన్ ఇటీవల వెల్లడించిన వివరాల ప్రకారం దాదాపు 643 బస్సులు స్క్రాప్ కింద తీసివేయాల్సినవి కాగా, మరో 1400 బస్సులు ఎప్పుడు ఏ క్షణంలో ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. అంటే దాదాపుగా రెండు వేల బస్సులు రోడ్లపై తిరగలేనివి ఉన్న సమయంలో కేవలం ఏడు వేల బస్సులతో అందరినీ ఎలా సంతృప్తి పరుస్తామన్న వాదనను అధికారులు తెరపైకి తెస్తున్నారు.

కొత్త డిపోల ఏర్పాటుకు అవరోధాలున్నప్పటికీ బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సరిపోతుంది. కానీ బస్సులను పెంచకుండా రూట్లను పెంచితే తాత్కా లికంగా ప్రజల్లో ప్రశంసలు పొందినప్పటికీ భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. కరోనా కంటే ముందు ఆర్టీసీలో జరిగిన సమ్మె అనంతరం హైదరాబాద్ నగరంలో ఏకంగా వెయ్యి బస్సులను రద్దు చేశారు. ఈ బస్సులనే రోడ్లపైకి ఎక్కించలేని పరిస్థితులలో కొత్త రూట్లలో కొత్త బస్సులు ఎలా నడపాలని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అదే విధంగా వరంగల్, నిజామాబాద్ లాంటి ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న నగరాలలో సిటీ బస్సులు నడపాలన్న డిమాండ్ పెరుగుతోంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్న చర్చ సంస్థలో జోరందుకుంది.

అయితే శివార్లలోని డిపోలలో బస్సుల సంఖ్య స్వల్పంగా ఉంది. ఉదాహరణకు మహేశ్వరం డిపోలో అతి తక్కువ బస్సులుండగా, ఆ ప్రాంతంలోని కాలనీలు, గ్రామాలలో బస్సులకు భారీ డిమాండ్ ఉంది. ఇదే తరహాలో రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలలోనూ బస్సులు నడపాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బస్సులను సమకూర్చితే తప్ప డిమాండ్‌ను అందుకోలేమని అధికారులు అంటున్నారు.

# రైతు సంక్షేమానికి పెద్ద పీట : ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా,డిసెంబర్ 13 : రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు సోమవారం హాలియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాటాడారు. రైతు బంధు పథకం కింద ఎనిమిదో విడతగా రాష్ట్ర ప్రభుత్వం 7,500 కోట్ల రూపాయలు విడుదల చేయడం పట్ల నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజల పక్షాన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ రైతు బంధు పథకం కింద కారుకు ఎకరాకు 5 వేల రూపాయలు పెట్టుబడి సహాయం, ఏ కాºణం చేతనైనా ఒక రైతు మృతి చెందిందే మృతి చెందిన రైతు కుటుంబానికి అండగా రైతు బీమా పథకం కింద 5 లక్షల రూపాయలు అందజేస్తున్నామన్నారు.వానకాలంలో రైతు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఇప్పటికీ లక్ష క్వింటాళ్ల



ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరాలను వెల్లడించారు. ఈ యాసంగిలో రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రజల్లో అయోమయం సృష్టించేందుకే బీజేపీ నాయకుడు చింతపండు నవీన్ యత్నిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఆయన వెంట టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# విజయనగరంలో ఒమిక్రాన్ కలకలం.. ఐర్లండ్ నుంచి వచ్చిన వ్యక్తికి పాజిటివ్..

విజయనగరం,డిసెంబర్ 13:విజయనగరం జిల్లాలో ఒమిక్రాన్ కేసు నమోదైనట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఐర్లాండ్ నుంచి ఈనెల 5న విజయనగరం జిల్లా వీరనారాయణపురం గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తికి ఒమిక్రాన్ పాజిటివ్‌గా నిర్ధాన అయినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఐర్లాండ్ నుంచి విజయనగరం జిల్లాకు వచ్చిన వ్యక్తి గురించి ముంబై ఎయిర్‌పోర్టు అధికారులు విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం ఇచ్చిన వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు చేశారు వైద్యులు. కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించబడింది తప్ప ఒమిక్రాన్ నిర్ధారించబడలేదని వైద్య, ఆరోగ్య శాఖ అప్పట్లో చెప్పింది. అయితే, ఒమిక్రాన్ నిర్ధారణకు సంబంధించి శాంపిల్స్ హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించినట్లు మాత్రం ప్రకటన రూపంలో వెల్లడించింది.

ఆ వ్యక్తిని హోమ్ ఐసోలేషన్‌లో వుంచినట్లు తెలిపింది. సదరు ఫలితం వెల్లడై ఒమిక్రాన్ నిర్ధారించబడినట్లు తాజాగా ప్రకటించింది. అయితే, ఐర్లాండ్ నుంచి ఆ వ్యక్తి జిల్లాలోకి అడుగు పెట్టినప్పటికే ఒమిక్రాన్ పాజిటివ్‌గా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో కూడా అదే విషయం హల్‌చల్ చేసింది. కాగా, కొద్ది రోజుల కిందట ఐర్లాండ్ నుంచి ముంబై ఎయిర్‌పోర్టులో దిగి కోవిడ్ పరీక్షలు కూడా చేయించుకోకుండా తిరుపతి వెళ్లిన ఆ వ్యక్తి అక్కడి నుంచి నేరుగా వీరనారాయణపురం లోని తన అత్తవారింటికి రావడంతో అవసరమనుకున్న కొంత మంది కుటుంబ సభ్యులకు కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగటివ్ వచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెల్లడించారు.

# ఒమిక్రాన్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్‌ను ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ( ంతీజీలతినిట ఐవతీతీతిలీజీశ్రీ ) చెప్పారు. ఈ ఉదయం 'ఢిల్లీ కీ యోగశాల' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. 'మేం ఒమిక్రాన్ వేరియంట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. అవసరమైతే తప్పకుండా ఆంక్షలు విధిస్తాం. ప్రస్తుతమైతే ఆంక్షలు విధించాల్సిన అవసరం కనిపించడంలేదు' అని కేజ్రీవాల్ అన్నారు.

అదేవిధంగా ఢిల్లీలో పాఠశాలలను తిరిగి ప్రారంభిస్తారా..? అన్న మీడియా ప్రశ్నకు.. 'ప్రస్తుతం ఢిల్లీలో స్కూళ్లకు శీతాకాల సెలవులు కొనసాగుతున్నాయి. శీతాకాల సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలను పునఃప్రారంభించే విషయంలో నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు.



# వాతావరణ మార్పులను ఎన్నికల ఎజెండాగా చేసుకోవాలి: ఆదిత్య ఠాక్రే

ముంబై, డిసెంబర్ 13: వాతావరణ మార్పులను ఎన్నికల ఎజెండాగా రాజకీయ పార్టీలు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహారాష్ట్ర పర్యావరణ మంత్రి ఆదిత్య ఠాక్రే తెలిపారు. వాతావరణ మార్పు సమస్య కేవలం ముంబై లేదా మహారాష్ట్రకే పరిమితం కాదని, ప్రపంచం మొత్తానికి కీలకమైన సమస్య అని చెప్పారు. వాతావరణంలో మార్పు జరిగితే, అది ఇతర దేశాల కంటే మన దేశ ప్రజలపైనే ఎక్కువగా ప్రభావం చూపుతుందని అన్నారు. మన దేశంలో జనసాంద్రత ఎక్కువగా ఉండటమే దీనికి కారణమన్నారు.

ఈ నేపథ్యంలో రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో వాతావరణ మార్పులపై చర్చిస్తామని మహారాష్ట్ర పర్యావరణ మంత్రి ఆదిత్య ఠాక్రే తెలిపారు. అలాగే గ్రీన్ సిలబస్‌ను పాఠశాల విద్యా శాఖకు అప్పగిస్తామని చెప్పారు. భూమి పచ్చదనం కోసం ఇది చాలా ముఖ్యమైన అడుగు అవుతుందని తాను ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

# రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీనారాయణకు ముందస్తు బెయిల్




అమరావతి, డిసెంబర్ 13:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఏ2గా ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీనారాయణకు ముందస్తు బెయిల్ మంజూరైంది. ఏపీ హైకోర్టు లక్ష్మీనారాయణను 15 రోజుల పాటు అరెస్టు చేయవద్దని ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. గత శుక్రవారం ఏపీ సీఐడీ అధికారులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఇంట్లో సోదాలు చేసిన విషయం తెలసిందే. ఈ క్రమంలో ఈరోజు ఆయనను సీఐడీ తమ ముందు హజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. లక్ష్మీనారాయణ ఈరోజు సీఐడీ అధికారుల ముందు హజరుకావల్సి ఉండగా.. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన తనను పోలీసులు అరెస్టు చేయకుండా ఉండేందుకు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు.

# ప్రజా కల్యాణ మండపాన్ని ప్రారంభించిన మంత్రి వేముల

నిజామాబాద్, డిసెంబర్ 13:: జిల్లాలోని వేల్పూర్ మండల కేంద్రంలో రూ.50 లక్షల ఎమ్మెల్యే సిడిపి నిధులతో నూతనంగా నిర్మించిన ప్రజా కల్యాణ మండపాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నేటి పరిస్థితుల్లో పేదవారు పెండ్లి చేయాలంటే ఫంక్షన్ హాల్ కోసం వేళల్లో ఖర్చు చేయాల్సి పరిస్థితి ఉంది.

ఇలాంటి పరిస్థితుల్లో గ్రామంలో ఉన్న పేదవారు అతి తక్కువ ఖర్చుతో పెండ్లి చేసుకోవాలన్న ఉద్దేశంతో సిడిపి నిధుల నుంచి 50 లక్షలు మంజూరు చేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలందరికి అందుతున్నాయన్నారు. ఈ కల్యాణ మండపం నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీకి అప్పజెప్పుతు మండపం తాళాలు సర్పంచ్, ఆర్డీఓకి మంత్రి అందజేశారు.

అలాగే మంత్రి వేముల నానమ్మ, తాతయ్యల పేర్ల మీదుగా పేద ప్రజలకు ఇబ్బంది ఉండకుండా కల్యాణ మండపంలో అవసరమైన కుర్చీలు, బల్లలు, వంట సామగ్రి మొత్తం రూ.5 లక్షలు తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు.

# ఏపీ హైకోర్టు అదనపు భవనానికి శంకుస్థాపన

అమరావతి, డిసెంబర్ 13:ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు భవన నిర్మాణం పనులకు సోమవారం శంకుస్థాపన పడింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా భూమిపూజ చేశారు. ఉదయం 9.05 గంటలకు శాస్త్రోక్తంగా భూమిపూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సీఆర్‌డీఏ అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రస్తుతం ఉన్న భవనం కోర్టు విధుల నిర్వహణకు సరిపోకపోవడం లేదు. దాంతో ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనానికి ఎదురుగా అదనపు భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. అదనపు భవనం జీ+ 5 సామర్థ్యంతో నిర్మించనున్నారు. నిర్మాణ ప్రణాళిక, ఇతర విషయాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇతర న్యాయమూర్తులకు ఉన్నతాధికారులు వివరించారు.

# జనవరి 5 నుంచి తమిళనాడు అసెంబ్లీ తొలి సెషన్

చెన్నై, డిసెంబర్ 13:: 2022 ఏడాదికిగాను తమిళనాడు అసెంబ్లీ తొలి సెషన్ జనవరి 5న ప్రారంభం కానున్నది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం సోమవారం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. తొలి రోజు అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం గవర్నర్ ఖీఔ రవి ప్రసంగించనున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో జనవవరి 5 నుంచి అసెంబ్లీని ప్రారంభించాలని గవర్నర్ ఆదేశించనట్లుగా పేర్కొన్నారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 174 క్లాజ్ (1) ప్రకారం తనకు సిద్ధించిన అధికారాల మేరకు తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా నేను.. 2022, జనవరి 5 నుంచి చెన్నై సెక్రెటేరియట్‌లోని అసెంబ్లీ చాంబర్‌లో సమావేశం కావాలని రాష్ట్ర అసెంబ్లీని ఆజ్ఞాపిస్తున్నాను అని గవర్నర్ ఖీఔ రవి పేర్కొన్నట్లుగా ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్‌లో ఉన్నది.



# డ్రంక్ అండ్ డ్రైవ్‌తోనే రోడ్డు ప్రమాదాలు : డిఐజి రంగనాథ్



నల్లగొండ, డిసెంబర్ 13:: మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాలలో ఒక వ్యక్తి చనిపోవడం, కనీసం ముగ్గురు గాయలపాలై అంగవైకల్యం చెందుతున్నారని డిఐజి ఏ.వి. రంగనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో మొదటిసారిగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ ప్రక్రియ, రోడ్డు ప్రమాదాల వీడియోలను మద్యం సేవించి పట్టుబడిన వారికి అవగాహన కల్పించే సెంటర్‌ను ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ మోతాదులో మద్యం సేవిస్తే శిక్ష సైతం ఎక్కువగానే ఉంటుందని, డ్రంక్ అండ్ డ్రైవ్ అనేది పెద్ద నేరం చేసినట్లుగా భావించాల్సిన అవసరం లేదన్నారు. అదే సమయంలో మనలను మనం రక్షించుకోవడం, ప్రమాదాలకు కారణమవుతున్న విషయాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారి సంఖ్యను క్రమంగా తగ్గించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం టిటిఐ ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. మనల్ని మనం కాపాడుకుంటూ, భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులపై ప్రేమ ఉంటే మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ను మరింత ముందుకు తీసుకెళ్లి మంచి కౌన్సిలింగ్ సెంటర్ గా తీర్చిదిద్దాలని పోలీస్ అధికారులకు సూచించారు.

సరైన అవగాహన లేకపోవడం, చిన్న చిన్న తప్పుల కారణంగా పెద్ద సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితిని అర్థం చేసుకోవాలని, రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారికి వాహనం ఇచ్చిన వారిపై, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

అనంతరం మద్యం సేవించి వాహనాలు ఎట్టి పరిస్థితులలో నడపమని, హెల్మెట్, బెల్ట్ ధరించడం, మైనర్లకు వాహనాలు ఇవ్వమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో కార్యక్రమంలో డిటిసి ఎస్పీ సతీష్ చోడగిరి, అదనపు ఎస్పీ నర్మద, డీఎస్పీలు సురేష్ కుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, సిఐలు చీర్ల శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, బాలగోపాల్, ఆర్.ఐ.లు నర్సింహా చారి, స్పర్జన్ రాజ్, సంతోష్, ట్రాఫిక్, టిటిఐ సిబ్బంది పాల్గొన్నారు

# వైద్యారోగ్యంపై జగన్ సమీక్ష.. కఠిన ఆంక్షలకు నిర్ణయం

అమరావతి, డిసెంబర్ 13:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒమిక్రాన్ కేసు బయటకు రావడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో కఠిన ఆంక్షలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్ష జరిపారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం ఆళ్ల నానితోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒమిక్రాన్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వారం రోజుల్లో జీన్ సీక్వెన్సింగ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని అధికారులు సీఎంకు తెలిపారు. రాష్ట్రంలో ఫీవర్ సర్వే కొనసాగిస్తామని.. ప్రభుత్వ దవాఖానల్లో నెలాఖరు కల్లా 144 పీఎస్ఏ ప్లాంట్లు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొవిడ్ కొత్త వేరియంట్ అయిన ఒమిక్రాన్ కేసు నమోదు కావడంతో ఏపీ సర్కార్ అప్రమత్తమైంది. ఒమిక్రాన్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ఇక నుంచి మరింత కఠినంగా ఆంక్షలు అమలు చేయాలని అధికారులకు జగన్ ఆదేశించారు. వచ్చే నెలలోగా నిర్దేశిత వయస్సుల వారు అందరికీ డబుల్ డోస్ వ్యాక్సిన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను సమర్థంగా వినియోగించుకొనేందుకు యాప్‌ను అందుబాటులోకి తేవాలని, ఈ యాప్ ద్వారా ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొత్త వైద్య కళాశాలల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని.. క్యాన్సర్ రోగులకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలని అధికారులను జగన్ ఆదేశించారు.

# మొక్కలు నాటిన ఎంపీ కె.కేశవరావు



హైదరాబాద్, డిసెంబర్ 13: ప్రతి ఒక్కరు తమ పుట్టిన రోజున లేదా ఏదైనా పండుగ రోజున కాని మొక్కలు నాటాలని ఎంపీ కె.కేశవరావు పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా.. తన పుట్టినరోజును పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని తన నివాసంలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఎలా అయితే పాల్గొన్నారో తెలంగాణ అభివృద్ధిలో కూడా ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు.

వాతావరణ మార్పులను అరికట్టేందుకు చెట్లు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారురు.

పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కేకే ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కేకే తనయ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ రాఘవ, టీఆరెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాగనీకి పైసల్లేక.. మద్యం షాప్ కే కన్నం వేశారు..

వరంగల్ డిసెంబర్ 13: : వారిద్దరూ సగటు జీవులే. రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులు. ఆ ఇద్దరు మద్యంకు బానిసలయ్యారు. రెక్కల కష్టంతో వచ్చిన సంపాదన వారి మద్యం అవసరాలనే కాదు, కుటుంబ అవసరాలను తీర్చలేదు. మద్యం మత్తుకు బానిసైన ఆ ఇద్దరు మద్యం షాప్ కు కన్నం వేసి, అందినకాడికి మందు బాటిళ్లను దోచుకోవడంతో పాటు, లిక్కర్ షాపుల్లోని మనీని కూడ దొంగిలించి, లైఫ్ ఎంజాయ్ చేయాలనుకొన్నారు. అనుకొన్న ప్రకారం మద్యం షాప్ కు కన్నం వేశారు. మద్యం, మనీ దొంగలించుకపోయారు. కానీ వరంగల్ కమిషనరేట్ పోలీసులు కేసును దర్యాప్తు చేసి, దొంగతనం చేసిన ఇద్దరి దొంగలను అరెస్ట్ చేశారు. వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి వెంకటలక్ష్మి ఈ కేసుకు సంబంధించిన వివరాలను పత్రికలకు విడుదల చేశారు.




సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపులకనపర్తి గ్రామ శివారులోని మద్యం దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను సంగెం పోలీసులు అరెస్టు చేశారన్నారు. వీరి నుండి 26 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నట్లు డిసిపి వెంకటలక్ష్మి తెలిపారు. నిందితులు అక్కడి నుండి తప్పించుకోని పోయే సమయంలో మద్యం దుకాణంలోని సిసి కెమెరాల డివిఆర్‌ను సైతం దొంగిలించి, మద్యం సీసాలను వేసుకున్న గోనే సంచిలోనే వేసుకోని తమతో తెచ్చుకున్న ద్విచక్రవాహనంపై పారిపోయారు. ఇదే సమయంలో నిందితులు దొంగిలించిన డివిఆర్ నీటి కెనాల్ పడవేసి వెళ్లారు. నిందితులు మరో ఇద్దరితో కల్సి 2019 సంవత్సరంలో గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రైస్ మిల్లులో ఏడు క్వింటాళ్ళ బియ్యాన్ని చోరీ చేసిన సంఎఆధారంగా. మద్యం దుకాణంలో జరిగిన చోరీపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మద్యం దుకాణంలో దొరికిన క్లూస్ తో నిందితులను గుర్తించారు. గవిచర్ల ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నిందితులు పోలీసులకు పట్టుబడ్డారని వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి వెంకట లక్ష్మి తెలియజేశారు.

# కరోనా అయితేంది.. .. వీ డోన్ట్ కేర్ అంటున్న తెలంగాణ ప్రజలు..

హైదరాబాద్, డిసెంబర్ 13:కరోనా థర్డ్ వేవ్ హెచ్చరికలు, వేగంగా వ్యాపిస్తున్న ఒమిక్రాన్ ఆందోళనల వేళ రాష్ట్రంలో కరోనా వ్యాక్సినేషన్ ఇప్పటికీ మందకొడిగానే సాగుతోంది. రెండు డోస్‌ల కరోనా వ్యాక్సిన్ వేసుకుంటేనే కొవిడ్ నుంచి పూర్తి స్థాయిలో రక్షణ లభిస్తుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నా? తెలంగాణలో మాత్రం ఆశించినస్థాయిలో వ్యాక్సినేషన్ జరగడం లేదు. ఇప్పటికీ మొదటి డోస్ తీసుకున్న వారిలో 45శాతం మంది కరోనా రెండో డోస్ వేయించుకోలేదు. రాష్ట్రం లో 18ఏళ్లకు పైబడి? కరోనా టీకాకు అర్హులైన వారిలో 2,77,67000 మంది ఉండగా? వారిలో ఇప్పటి వరకు 11,96,4703 మంది అంటే 45శాతం మంది రెండో డోస్ టీకా తీసుకోలేదు. ఈ పరిస్థితుల్లో కరోనా ఒమిక్రాన్ వేరియంట్, లేదా థర్డ్ వేవ్ విరుచుకుపడితే మరోసారి సెకండ్ వేవ్ తరహా విపత్కర పరిస్థితులు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక దాదాపు 17 జిల్లాల్లో రెండు డోస్‌ల వ్యాక్సినేషన్ 50శాతం మందికి కూడా పూర్తికాలేదు.

కరోనా రిస్క్ ఎదుర్కొంటున్న దేశాల నుంచి తెలంగాణకు మరో 791 మంది వచ్చారు. వీరందరికీ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వైద్య, ఆరోగ్యశాఖ ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించింది. వీరిలో మరొకరికి కొవిడ్ పాజిటివ్‌గా గుర్తించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు కొవిడ్ ఒమిక్రాన్ అనుమానిత కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు విదేశాల నుంచి వచ్చిన 17మంది పాజిటివ్ శాంపిల్లను జీనోమ్ టెస్టుకు పంపగా 13 మంది ఫలితాలు వచ్చాయి. ఇంకా నలుగురి ఫలితాలు రావాల్సి ఉంది.

తెలంగాణలో మరో 146 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో 6,78,288 మందికి కరోనా సోకింది. కరోనా నుంచి కోలుకోవడంతో వివిధ ఆస్పత్రుల నుంచి 189 మంది డిశ్చార్జి అయ్యారు. కరోనాతో మరో ఇద్దరు కన్నుమూశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 4007 మంది కరోనాతో ప్రాణాలు వదిలారు. మరోవైపు రాష్ట్రంలో కరోనా యాక్టివ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో 3846 మంది కరోనాతో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26, 625 మందికి కరోనా టెస్టులు చేశారు. తాజా పాజిటివ్ కేసుల్లో అత్యధికంగా జీహెచ్ఎంసీ పరిధిలో 72, రంగారెడ్డి 20లో అత్యధికంగా కరోనా కేసులు నమోదయ్యాయి.

# బస్సు, లారీ ఢీ.. ఐదుగురికి గాయాలు



జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 13:: ఆర్టీసీ బస్సు, లారీ ఢీ కొన్న ఘటనలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని కాటారం మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కాటారం సీఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో క్షతగాత్రులను పోలీసు వాహనంలో దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

శాంతా వసంతా ట్రస్టు
ఆహ్వానం
డా॥ ఎల్లూరి శివారెడ్డి గారికి 'వరప్రసాద్ రెడ్డి ఉత్తమ సాహితీవేత్త' పురస్కారం
డా॥ జుర్రు చెన్నయ్య గారికి 'తెలుగుభాషా సేవారత్న' పురస్కారం
ముఖ్యఅతిథి
మాన్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
వ్యవసాయ శాఖామాత్యులు, తెలంగాణ ప్రభుత్వం
సభాధ్యక్షులు
'పద్మభూషణ్' పురస్కార గ్రహీత
డా॥ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి
'శాంతా బయోటెక్నిక్స్' వ్యవస్థాపకులు
విశిష్ట అతిథి
డా॥ ఎం.కె.రాము
'రసమయి' సాహితీ సాంస్కృతిక సంస్థ, స్థాపక అధ్యక్షులు
2021 డిసెంబర్ 18, శనివారం సాయంత్రం 6 గం॥ 05 ని॥లకు
వేదిక : డా॥ దేవులపల్లి రామానుజరావు కళామందిరం,
తెలంగాణ సార్వస్వతపరిషత్తు, తిలక్‌రోడ్, ఆబిడ్స్, హైదరాబాద్
మిమ్మల్ని ఈ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

